ఐరిష్ తిప్పలు..!

- యాసంగి సీజన్‌లో కొత్త విధానం
- మార్కెట్‌కు వచ్చి విక్రయించాలనే షరతుతో రైతులకు ఇబ్బందులు
- కౌలు రైతు ఒప్పంద వివరాలు చూపడం కష్టం
- కొనుగోలు కేంద్రాలకు ఐరీస్ పరికరాలు
- గత విధానం వల్ల కొన్ని చోట్ల బినామీల పేరిట అక్రమాలు
- దళారుల్ని అరికట్టేందుకే.. : డిసిఎస్‌ఒ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ధాన్యం కొనుగోలు విధానంలో కొత్తగా తీసుకొచ్చిన ఐరీస్ పద్ధతి రైతులకు తలనొప్పిగా మారనుంది. రాష్ట్ర ప్రభుత్వం ఐకెపి, పిఎసిఎస్ కేంద్రాల ద్వారా రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేస్తోంది. ఈ యాసంగి సీజన్ నుంచి కొత్తగా ఐరీష్ విధానం తీసుకొచ్చారు. ఐరిష్ పద్ధతి వల్ల పండించిన రైతులే మార్కెట్‌కు వచ్చి ధాన్యాన్ని విక్రయించాలి. అప్పుడే అతని ఐరీషనమోదు చేస్తారు. ఇంతకుముందు కుటుంబంలో ఎవరో ఒకరు ధాన్యం తూకం వేసే సమయంలో ఉండి ఆధార్ నెంబర్, ఒటిపి చెబితే సరిపోయేది. కొత్త విధానం వల్ల రైతే మార్కెట్‌కు వెళ్లి ఐరీస్ ఇవ్వాలి. టోకెన్ పద్ధతిలో ధాన్యం ఎప్పుడు కాంటా వేస్తారో తెల్వని పరిస్థితుల్లో రైతు కళ్లాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తది. కౌలు రైతు యజమాని నుంచి ఒప్పంద వివరాలివ్వాలి. లేదంటే ధాన్యం అమ్ముకోలేరు.

రాష్ట్రంలో యాసంగి వరి కోతలు జోరుగా సాగుతున్నాయి నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, నిజామాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ ఇతర జిల్లాల్లో ధాన్యం మార్కెట్‌కు వస్తోంది. ఈ సీజన్‌లో నీటి ఎద్దడి వల్ల ధాన్యం దిగుబడులు తగ్గే అవకాశముంది. రాష్ట్రంలో పౌరసరఫరాల శాఖ ద్వారా గతేడాది యాసంగిలో 66.85 లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరించారు. ఈ సీజన్‌లో 60.70 లక్షల టన్నుల ధాన్యమే సేకరించే అవకాశముంది. ఐకేపీ, పీఎసీఎస్‌ల ఆధ్వర్యంలో ఏడు వేల కొనుగోలు కేంద్రాలు పెట్టనున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో యాసంగి సీజన్‌లో 7.46 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. 800 కేంద్రాలు పెట్టి 6.88 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు చేయనున్నారు.

కొత్తగా ఐరిష్ విధానం

ధాన్యం కొనుగోలు విధానంలో పౌర సరఫరాల శాఖ కొత్తగా ఐరిష్ విధానాన్ని అమలు చేస్తుంది. గతంలో రైతు ధాన్యాన్ని విక్రయించేందుకు ఆధార్ నంబర్ ఇచ్చేవారు. ఆ నెంబర్‌ను బ్యాంక్ ఖాతాకు అనుసంధానం చేయగానే రైతు సెల్‌ఫోన్‌కు ఓటీపీ వచ్చేది. దానిని ట్యాబ్‌లో నమోదు చేసి ఓటీపీ ద్వారా ధాన్యం కొనుగోలు చేసేది. ఈ విధానం వల్ల కొందరు దళారులు సైతం రైతుల పేరిట ధాన్యం విక్రయాలు చేసిన పరిస్థితి ఉంది. మిల్లర్లు, వ్యాపారులు దళారుల ద్వారా బినామీ రైతుల పేరిట ధాన్యం అమ్మకాలు జరిపి అక్రమాలకు పాల్పడిన ఉదంతాలు రాష్ట్రంలో అనేక చోట్ల వెలుగు చూశాయి. అందుకే ఈ సీజన్ నుంచి కొత్తగా ఐరీస్ పద్ధతిని తీసుకొచ్చారు. ధాన్యం పండించిన రైతు మార్కెట్‌కు ఖచ్చితంగా రావాలి. ధాన్యాన్ని కాంటా వేసిన తర్వాత సెంటర్ నిర్వాహకులు రైతు ఐరీస్‌ను తీసుకుంటారు. ఆధార్ నంబర్‌ను బ్యాంకు ఖాతాకు అనుసంధానం చేయడం ద్వారా వచ్చే ఓటీపీతోపాటు అదనంగా ఐరిష్‌ను కూడా ట్యాబ్‌లో నమోదు చేస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా 7 వేల ధాన్యం కొనుగోలు కేంద్రాల్ని ఏర్పాట చేసి ధాన్యాన్ని కొనుగోలు చేయనున్నారు. అన్ని సెంటర్లకు కూడా ఐరిష్ పరికరాల్ని అందజేశారు. ఐరిష్ విధానం గురించి కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు.

కౌలు రైతులు ఒప్పంద పత్రాలు చూపేదెట్ల..

ఐరీస్ నమోదు విధానం కౌలు రైతులకు కొత్త తిప్పలు తెచ్చింది. రాష్ట్రంలో 40 శాతానికి పైగా పంట భూముల్ని కౌలు రైతులు సాగు చేస్తున్నారు. కౌలుదారి రక్షిత చట్టం అమల్లో ఉన్నందున భూమి యజమానులెవ్వరూ కౌలు దారులకు ఒప్పంద పత్రాలు రాసి ఇవ్వడం లేదు. పరస్పర అంగీకారంతోనే కౌలు విధానం కొనసాగుతుంది. తాజాగా ప్రభుత్వం తెచ్చిన ఐరిష్ విధానంలో కౌలు రైతులు తాము పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవాలంటే ముందుగా పట్టాదారుతో రాసుకున్న కౌలు ఒప్పంద పత్రాల వివరాల్ని మండల వ్యవసాయ విస్తరణాధికారికి ఇవ్వాలి. ఎవరి భూమిని కౌలుకు తీసుకున్నారో వివరాలను నమోదు చేయించాలి. ఆ వివరాలను ఎఇఒ ఓపీఎంఎస్ (ఆన్‌లైన్ పొక్యూర్‌మెంట్ మేనేజ్ మెంట్ సిస్టమ్)లో నమోదు చేస్తారు. తద్వారా కౌలు రైతు పండించిన ధాన్యాన్ని విక్రయించుకునే అవకాశముంటది. అయితే రాష్ట్రంలో కౌలు విధానానికి చట్టబద్దత లేదు. వ్యక్తుల మధ్య ఉన్న సంబంధాలను బట్టి కౌలు సాగు కొనసాగుతోంది. సీజన్ ప్రారంభానికి ముందే చెబితే ఒప్పందం చేసుకునే వీలుంటుంది. యాసంగి సీజన్ ముగింపులో ఒప్పంద వివరాలు ఇవ్వడం ఎలా సాధ్యమని కౌలుదారులు ప్రశ్నిస్తున్నారు.

కళ్లాల్లోనే రైతు పడిగాపులు

ఐకేపీ, పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాలకు రైతులు ధాన్యం తీసుకెళ్లాలి. తేమ లేకుండా ఆరబోసుకుని శుభ్రం చేయాలి. గ్రేడ్-ఎ, సాధారణ రకాలకు వేర్వేరు ధర ఇస్తారు. ధాన్యం శుభ్రం చేశాక సెంటర్ నిర్వాహకులు రైతుకు టోకెన్ నెంబర్ ఇస్తారు. సీరియల్ ప్రకారం కాంటా వేస్తారు. వారాల తరబడి ధాన్యం కాంటాకు నోచుకోక రైతులు మార్కెట్‌లో ఉండాల్సి వస్తోంది. ధాన్యం కాంటా వేసే సమయంలో రైతు తప్పకుండా సెంటర్‌కు రావాలనే షరతు పెట్టడంతో కళ్లాల వద్దనే పడిగాపులు కాయాల్సి వస్తదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

వ్యాపారుల వైపు రైతుల మొగ్గు

రైస్. మిల్లర్లు,. వ్యాపారులకు. ధాన్యాన్ని విక్రయించేందుకు రైతులు మొగ్గు చూపుతు న్నారు. నీటి. ఎద్దడి. వల్ల. వరి. పైర్లు ఎండి పోయాయి. దీంతో ధాన్యం దిగుబడుల్లో తాలు, ఇతర వేస్టేజి అధికంగా ఉంటుంది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్మాలంటే తేమ, తాలు, చెత్త లేకుండా ఉండాలి. అయినా బస్తాకు 3- 5 కిలోల వరకు తరగు తీస్తారు. హమాలీ చార్జీలు చెల్లించాలి. వీటికి తోడు ఐరీస్ తిప్పలు రావడంతో కొందరు రైతులు కోత కోయగానే నేరుగా మిల్లులకు తరలిస్తున్నారు. వారం పది రోజుల ఒప్పందంతో డబ్బులు తీసుకుంటున్నారు.

దళారుల్ని అరికట్టేందుకే ఐరీస్

కె.వనజాత, జిల్లా పౌర సరఫరాల అధికారి, సంగారెడ్డి

ధాన్యం కొనుగోళ్ల విషయంలో దళారులు అక్రమాలకు పాల్పడకుండా ఉండేందుకే ఐరిష్ విధానం. పక్క రాష్ట్రాల నుంచి ధాన్యం తెచ్చి ఇక్కడి కేంద్రాల్లో విక్రయించడానికి వీలుండదు. మిల్లర్లు, వ్యాపారులు బినామీ రైతుల పేరిట ధాన్యం తెచ్చి మద్దతు పొందడం కూడా ఉండదు.

మైనార్టీ స్టడీసర్కిల్‌లో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మైనార్టీ స్టడీసర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యుపిఎస్‌సి ప్రిలిమ్స్, మెయిన్స్ ఉచిత శిక్షణ కోసం ఈ నెల 22లోగా దరఖాస్తు చేసుకోవాలని డైరెక్టర్ టి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఏడాదికి 100 మందికి శిక్షణ ఇస్తామని, అన్ని రిజర్వుడు కేటగిరీల్లో మహిళలకు 33 శాతం, దివ్యాంగులకు ఐదు శాతం రిజర్వేషన్లు ఉంటాయని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి 28న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్ష ఉంటుందని, దీని ఆధారంగా సీట్లు ఇస్తామని తెలిపారు. వివరాలకు 040-23236112 నంబరులో లేదా మైనార్టీ గురుకుల సొసైటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

తెలంగాణకు వర్షసూచన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో రాగల ఐదు రోజుల పాటు ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణకేంద్రం మంగళవారం వెల్లడించింది. మధ్య మహారాష్ట్ర వద్ద కేంద్రీకృతమైన ఆవర్తనం అంతర్గత కర్ణాటక మీదుగా దక్షిణ తమిళనాడు వరకు సగటు సముద్ర మట్టానికి 0.9 కి.మీ ఎత్తులో కొనసాగుతోందని తెలిపింది. గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీస్తాయని పేర్కొంది. మంగళవారం తెలంగాణలో కిందిస్థాయి గాలులు దక్షిణ, ఆగ్నేయ దిశల నుంచి వీస్తున్నట్టు తెలిపింది. గత రెండ్రోజులుగా రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. 44.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు మొన్నటి వరకు నమోదు కాగా..మంగళవారం 40 డిగ్రీల ఉష్ణోగ్రతే అధికంగా నమోదైంది. మరో ఐదు రోజుల పాటు ఉష్ణోగ్రతల ప్రభావం తక్కువగా ఉంటుందని వాతావరణశాఖ తెలిపింది.

రాజీవ్ రతన్ మృతి పట్ల ఉత్తమ్, మధుయాష్కీ దిగ్భ్రాంతి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ విజిలెన్స్ డిజి రాజీవ్ రతన్ హఠాన్మరణంపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్, పిసిసి కార్యనిర్వాహక అధ్యక్షులు జగ్గారెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎంతో నిజాయితీతో పని చేసే ఐపిఎస్ అధికారిని కోల్పోవడం బాధాకరమన్నారు. మేడిగడ్డ ప్రాజెక్టుపై ప్రభుత్వం నియమించిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌పై విచారణకు సారథ్యం వహించిన ఆయన... కాళేశ్వరం ప్రాజెక్టు అక్రమాలపై ఎంతో కీలకమైన అంశాలను ప్రభుత్వానికి అందించారని పేర్కొన్నారు.

బిజెపి బౌండరీలో మందకృష్ణ మాదిగ

- న్యూట్రల్‌గా ఏ ప్రశ్న అడిగినా సమాధానం చెబుతాం
- విలేకర్లతో ఇష్టాగోష్టిగా జగ్గారెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ బిజెపి బౌండరీలో ఉండి మాట్లాడుతున్నారని పిసిసి కార్యనిర్వాహక అధ్యక్షులు జగ్గారెడ్డి చెప్పారు. ఆయన మాటలు రాజకీయపరమైనవేనన్నారు. ఆయన న్యూట్రల్‌గా ఉండి మాట్లాడితే ఏ ప్రశ్న అడిగినా సమాధానం చెబుతామన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో విలేకర్లతో ఆయన ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఒక మాదిగను రాజ్యసభ సభ్యుడిగా చేయమని బిజెపిని అడిగావా? కేంద్ర మంత్రి చేయాలని డిమాండ్ అయినా చేశావా? బంగారు లక్ష్మణ్‌ను నవ్వులపాలు చేసినప్పుడు కనీసం స్పందించావా? మీరా కుమార్ స్పీకర్ చేసింది కాంగ్రెస్ కాదా? అని ప్రశ్నించారు. ప్రధాని మోడీ, హోంశాఖ మంత్రి అమిత్‌షా జిమ్మిక్కులతో అధికారంలోకి రావాలన్న వైఖరితో పని చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కాంగ్రెస్‌పై అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. ప్రజలు ఎప్పుడూ సుఖ సంతోషాలతో ఉండాలని రాహుల్ గాంధీ కుటుంబం కోరుకుంటారని తెలిపారు. అధికారం కోసం అడ్డదారులు తొక్కరని చెప్పారు. ఇప్పుడు నీతులు చెబుతున్న బిజెపి నేతలెవరూ జాతీయోద్యమంలో లేరన్నారు. ఈసారి కేంద్రంలో బిజెపి ఓడిపోవడం ఖాయమన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు అన్ని బిఆర్‌ఎస్‌కు అనుకూలంగా వచ్చాయన్నారు. కానీ కాంగ్రెస్ విజయం సాధించిందని గుర్తు చేశారు. కొంతమంది బతుకుదెరువు కోసం ఏర్పాటు చేసుకున్న సర్వే సంస్థలను నమ్మకూడదని చెప్పారు. రాహుల్ గాంధీనే కాంగ్రెస్‌లో కింగ్. ఆయననే కింగ్ మేకర్. కెసిఆర్ ప్రస్టేషన్‌లో ఉండి ఏం మాట్లాడుతున్నారో ఆయనకే తెలియడం లేదు' అని ఎద్దేవా చేశారు. తాను పిసిసి అధ్యక్ష పదవి కోరుకోవడంలో తప్పేమీ లేదన్నారు.

జలాశయాల్లోని నీటి నిల్వలపై శ్వేతపత్రం

- సాగునీటిని తక్షణమే విడుదల చేయండి
- సిఎం రేవంత్‌కు సిపిఎం లేఖ
- కాళేశ్వరంపై సూచనలు స్వీకరించి, అఖిలపక్షం ముందుంచాలని విజ్ఞప్తి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ప్రస్తుతం పంటలెండిపోతున్నాయని సిపిఎం ఆందోళన వ్యక్తం చేసింది. ఫలితంగా రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేసింది. వారిని తక్షణం ఆదుకునేందుకు వీలుగా శ్రీరాంసాగర్, మానేరు, మల్లన్నసాగర్ తదితర జలాశయాల్లోని నీటి నిల్వలకు సంబంధించిన పూర్తి వివరాలతో శ్వేతపత్రాన్ని ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరింది. తద్వారా సాగునీటి విడుదలకు ఉన్న అవకాశాలను స్పష్టం చేయాలని విజ్ఞప్తి చేసింది. నీటిని విడుదల చేయడం ద్వారా కాపాడగలిగిన మేరకు పంటలను కాపాడాలని సూచించింది. మిగిలిన వాటికి నష్టపరిహారం చెల్లించాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, జూలకంటి రంగారెడ్డి, జి.నాగయ్య, టి.సాగర్... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంగళవారం లేఖ రాశారు. సోమవారం తమ పార్టీ ఆధ్వర్యంలో మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలను సందర్శించామని వారు లేఖలో పేర్కొన్నారు. మేడిగడ్డలో కుంగిన పిల్లర్లు రోజురోజుకూ మరింత కుంగుతున్నాయని తెలిపారు. వర్షాలు పడితే అవి మరింత వేగంగా కుంగిపోయే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. అన్నారం బ్యారేజీలో బుంగ ఏర్పడిన చోట తాత్కాలికంగా పూడ్చినప్పటికీ ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించారు. దీనిపై న్యాయవిచారణ జరిపి బాధ్యులపైన చర్యలు తీసుకోవాలని కోరారు. గత ప్రభుత్వం కమీషన్ల కోసం ప్రయివేటు కాంట్రాక్టర్లతో కుమ్మక్కయిన ఫలితంగానే ఇలాంటి పరిణామాలు సంభవించాయని తెలిపారు. కాళేశ్వరం పేరుతో రీడిజైన్ చేసిన ప్రాజెక్టు భవిష్యత్ గురించి నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనలు, ఇతర నిపుణుల అభిప్రాయాలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వాటిని అఖిలపక్షం ముందుంచాలంటూ కోరారు. గత ప్రభుత్వం సకాలంలో వ్యవసాయ ప్రణాళికను రూపొందించకపోవటంతోపాటు ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు కూడా కంటింజెన్సీ ప్రణాళికను రూపొందించకపోవటంతో సమస్య మరింత తీవ్రమైందని పేర్కొన్నారు. ఫలితంగా రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని వాపోయారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రిగా స్వయంగా జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని వారు రేవంత్‌రెడ్డిని కోరారు.

అమెరికాలో హైదరాబాద్ విద్యార్థి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అమెరికాలో భారతీయ విద్యార్థుల మరణాలు ఆగడం లేదు. కొన్ని వారాల క్రితం క్లేవ్‌ల్యాండ్‌లో అదృశ్యమైన హైదరాబాద్ విద్యార్థి మహమ్మద్ అబ్దుల్ అర్ఫాత్ (25) మృతి చెందాడు. ఈ విషయాన్ని న్యూయార్క్‌లోని భారత దౌత్య కార్యాలయం మంగళవారం ఎక్స్‌లో ప్రకటించింది. "మేము గత కొంతకాలంగా వెతుకుతున్న మహమ్మద్ అబ్దుల్ అర్ఫాత్ ఓహైయోలోని క్లేవ్‌ల్యాండ్‌లో మృతి చెందారు. అతడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసేందుకు స్థానిక పోలీసులతో మేం సంప్రదింపులు జరుపుతున్నాం. మృతదేహాన్ని తరలించడానికి సహాయం చేస్తాం" అని పేర్కొంది. హైదరాబాద్‌కు చెందిన అబ్దుల్ మార్చి 7వ తేదీ నుంచి అదృశ్యమయ్యాడు. అతడు క్లేవ్‌ల్యాండ్ విశ్వవిద్యాలయంలో ఐటీ మాస్టర్స్ డిగ్రీ చేస్తున్నారు. తమకు గుర్తుతెలియని వ్యక్తుల నుంచి బెదిరింపు ఫోన్‌కాల్ వచ్చిందని అతడి తండ్రి మహమ్మద్ సలీం వెల్లడించారు. వారు 1,200 డాలర్లు డిమాండ్ చేస్తున్నారని.. ఇవ్వని పక్షంలో తమ కుమారుడి కిడ్నీ విక్రయిస్తామని హెచ్చరించినట్లు చెప్పారు. తాము అంగీకరించి.. అబ్దుల్ వాళ్ల అధీనంలోనే ఉన్నట్లు ఆధారాలు చూపాలని అడిగామన్నారు. దీనికి కిడ్నాపర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి ఫోన్ పెట్టేశారని.. మళ్లీ కాల్ చేయలేదని అప్పట్లో సలీం తెలిపారు. కాకపోతే.. కిడ్నాపర్ మాట్లాడటానికి ముందు ఫోన్‌లో ఎవరిదో ఏడుపు వినిపించిందన్నారు. ఆ నంబర్‌ను అమెరికాలోని తమ బంధువులకు పంపి.. క్లేవ్‌ల్యాండ్ పోలీసులకు అందజేయాలని చెప్పినట్లు తెలిపారు. అబ్దుల్ అదృశ్యంపై అతడి బంధువులు మార్చి ఎనిమిదిన క్లేవ్‌ల్యాండ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

రైతు కుటుంబాల్లో వెన్నెల నింపుతాం

- ఉగాది వేడుకల్లో మంత్రి జూపల్లి కృష్ణారావు

ప్రజాశక్తి-కల్చరల్

రైతు కుటుంబాల్లో నవ వసంతాలను తెచ్చి, పున్నమి వెన్నెలను నింపడమే లక్ష్యంగా సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శ్రీ క్రోధినామ తెలుగు సంవత్సర ఉగాది వేడుకలను ప్రభుత్వం ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. శ్రీ క్రోధీనామ సంవత్సర పంచాంగాన్ని ఆవిష్కరించారు. బాచుపల్లి సంతోష్ కుమార్ శాస్త్రి పంచాంగ పఠనం చేశారు. అనంతరం సంతోష్ కుమార్ శాస్త్రిని సన్మానించారు. రాష్ట్ర ప్రజలకు మంత్రి.. శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. వ్యవసాయ సంవత్సరంగా పరిగణించే ఈ ఉగాది నవ వసంతంలో రైతులకు మేలు కలగాలని, ప్రజలందరి ఆశయాలు నెరవేరి సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఉగాది రోజున చేసుకునే షడ్రుచుల సమ్మేళనమైన పచ్చడి జీవితంలోని అనేక అనుభవాలకు ప్రతీకన్నారు. జీవితంలో ఎదురయ్యే అనేక అనుభవాలను ఎదుర్కొని ముందుకు వెళ్లాలని ఇది సూచిస్తుందని తెలిపారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని, సంక్షేమ పథకాలు ప్రజలకు అందడం సంతృప్తినిచ్చిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్ల శంకర్, బిసి కమిషన్ చైర్మన్ వకుళభరణం కృష్ణమోహన్, సిఎస్ శాంతికుమారి, ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, సమాచార, పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ హన్మంత్ రావు, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, సిఎం ఓఎస్‌డి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

సారు పిలిచాడని పోతే.. సస్పెండయ్యారు

- ప్రభుత్వోద్యోగులతో బిఆర్‌ఎస్ ఎంపి అభ్యర్థి వెంకట్రామిరెడ్డి రహస్య సమావేశం
- ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని చర్యలు
- 106 మంది ప్రభుత్వ ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సార్ పిలిచాడని సమావేశానికి పోతే.. 106 మంది ప్రభుత్వ ఉద్యోగులు సస్పెండ్‌కు గురయ్యారు. ఈ వార్త ప్రస్తుతం సిద్దిపేట జిల్లాలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతుంది. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. సిద్దిపేటలో ఐదేళ్లకు పైగా కలెక్టర్‌గా పనిచేసిన వెంకట్రామిరెడ్డి ప్రస్తుతం బిఆర్‌ఎస్ మెదక్ ఎంపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న విషయం విదితమే. ఎన్నికల ప్రచార సన్నాహాల్లో భాగంగా.. సిద్దిపేట జిల్లాకు చెందిన కొంతమంది అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులతో పట్టణంలోని రెడ్డి ఫంక్షన్‌హాల్ ఇటీవల ఆయన రహస్యంగా సమావేశమయ్యారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ప్రచారంలోగానీ, సమావేశాల్లోగానీ ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొనకూడదు. కానీ, గతంలో జిల్లాలో పని చేసిన పెద్ద సారు పిలిచాడని.. ఎన్నికల సమావేశాలకు పోవద్దని తెలిసి కూడా సారుపై గౌరవంతో ప్రభుత్వ ఉద్యోగులు వెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు.. అనుమతులు లేకుండా, రహస్యంగా ప్రభుత్వ ఉద్యోగులతో ఎంపి అభ్యర్థి సమావేశం నిర్వహించారని ఎన్నికల అధికారులకు సమాచారం అందించారు. ఉద్యోగులు పారిపోకుండా గేటుకు తాళం కూడా వేశారు. విషయం తెలుసుకున్న ఉద్యోగులు కొంతమంది గేటు దూకి పారిపోయారు. ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అక్కడికి వచ్చి పరిశీలించారు. కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు మేరకు సిసి ఫుటేజ్‌లను పరిశీలించారు. అంతేకాకుండా, వారిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు కలెక్టర్‌ను కలిశారు. దాంతో 106 మంది ప్రభుత్వ ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సారు పిలిచాడని ఆయనపై గౌరవంతో సమావేశానికి పోతే సస్పెండ్ అయ్యామని ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు.

సస్పెండ్ అయిన వారు.. : సస్పెండ్ అయిన వారిలో సెర్ప్ ఉద్యోగులు 38 మంది.. వారిలో ఎపిఎంలు-14, సిసిలు-18, వివోఎలు-4, సివో-1, సిబి ఆడిటర్స్-1, అలాగే 68 మంది ఇజిఎస్ ఉద్యోగుల్లో ఎపివోలు-4, ఇసిలు -7, టిఎలు-38, సిఒలు-18, ఎఫ్ఎ-1 ఉన్నారు.

కలిసికట్టుగా ముందుకు పోవాలి

- ఉగాది వేడుకల్లో మహేశ్‌కుమార్ గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

క్రోధి నామ సంవత్సరంలో పార్టీ నాయకులు, కార్యకర్తలందరూ కలిసికట్టుగా ముందుకు పోవాలని టిపిసిసి కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ సూచించారు. కోపాలను తగ్గించుకుని సానుకూల దృక్పథంతో వ్యవహరించాలన్నారు. అప్పుడే మనం అనుకున్నది సాధించగలుగుతామన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో శ్రీనివాస మూర్తి పంచాగ శ్రావణం చేశారు. ప్రజల అభీష్టం మేరకు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని తెలిపారు. రేవంత్‌రెడ్డి వంద రోజులపాలన అద్భుతంగా సాగుతున్నదని తెలిపారు. గత ఉగాది వేడుకల్లో అనుకున్నట్టుగానే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. రాష్ట్రంలో ప్రజా పాలన నడుస్తోందన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 14 నుంచి 15 సీట్లు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో కూడా అందరు కష్టపడి పని చేస్తే కేంద్రంలో పార్టీ కూడా అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జి. చిన్నారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, ఎమ్మెల్సీ బలనూరి వెంకట్, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్, నాయకులు కుమార్‌రావు, నిరంజన్, చల్లా నర్సింహారెడ్డి, మెట్టు సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు

ప్రకృతి పానీయాలు ఆరోగ్యానికి మేలు

- ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి
- గడియారం సెంటర్‌లో ఉగాది పచ్చడి పంపిణీ

ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రకృతిలో లభించే పానీయాల వల్ల ఆరోగ్యాలకు ఎంతో మేలు జరుగుతుందని, కృత్రిమ పానీయాల వల్ల ఆరోగ్యాలు పాడవుతాయని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. మంగళవారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని నల్లగొండ జిల్లా కేంద్రంలోని గడియారం సెంటర్‌లో 'హానికరమైన కృత్రిమ పానియాలు మానేద్దాం - ప్రకృతి పానియాలు సేవిద్దాం' అనే నినాదంతో టిఎస్‌యుటిఎఫ్, జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ.. ప్రకృతిలో జరిగే మార్పులను ఉగాది పండుగ సూచిస్తుందన్నారు. ఉగాది పచ్చడిలో ఉండే షడ్రుచులకు సంబంధించిన పదార్థాలు మానవ ఆరోగ్యానికి మేలు చేస్తాయన్నారు. కార్పొరేట్ శక్తుల లాభాలను పెంచేందుకే శీతల పానీయాలు వచ్చాయని, వాటిని తాగడం వల్ల అనారోగ్యమే తప్ప లాభం లేదని అన్నారు. మహేష్‌బాబు లాంటి సినిమా హీరోలు శీతల పానీయాల అడ్వర్టైజ్‌మెంట్‌లు ఇస్తూ యువతను పెడదారి పట్టిస్తున్నారని, అలాంటివారు నిజంగా హీరోలేనా సమాజానికి నిజమైన విలన్స్‌గా భావించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. టిఎస్‌యుటిఎఫ్, జన విజ్ఞాన వేదిక సంయుక్తంగా పదేండ్లుగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నందున వారిని అభినందిస్తున్నట్టు తెలిపారు. టిఎస్‌యుటిఎఫ రాష్ట్ర అధ్యక్షులు జంగయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కమిటీలు సమాజానికి మేలుకోరే ఇలాంటి కార్యక్రమాలు చేయాలని సూచించారు. శీతల పానియాలు తయారు చేసే కంపెనీలకు ప్రభుత్వాలు ఇబ్బడి ముబ్బడిగా రాయతీలు కల్పిస్తున్నాయని, ఆ రాయితీలను రద్దు చేయాలని కోరారు. టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి మాట్లాడుతూ.. శాస్త్రీయ ఆలోచనతోనే సమాజం ముందుకు పోతుందని, శాస్త్రీయ వైఖరులను అలవర్చుకునే యువత తమ భవిష్యత్‌ను ఉజ్వలంగా మలుచు కోగలుగుతుందని చెప్పారు. బహుళ జాతీయ సంస్థలు తమ స్వప్రయోజనాల కోసం మార్కెట్లోకి విచ్చలవిడిగా సరఫరా చేస్తున్న శీతల పానీయాలను తాగొద్దని ప్రజలను కోరారు. కార్యక్రమంలో సుమారు 800 మంది ప్రజలు ఉగాది పచ్చడి సేవించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎం.రాజశేఖర్‌రెడ్డి, జెవివి రాష్ట్ర కార్యదర్శి వెంకటరమణారెడ్డి, టిఎస్‌యుటిఎఫ్ నల్లగొండ జిల్లా అధ్యక్షులు ఎడ్ల సైదులు, ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ళ వెంకటేశం, జెవివి జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, టిఎస్‌యటిఎఫ్ కోశాధికారి నర్రా శేఖర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శులు జి.అరుణ, గేర నర్సింహ, నలపరాజు వెంకన్న, మురళయ్య, సోషల్ మీడియా కన్వీనర్ యరనాగుల సైదులు, విఠ టి.భానుప్రసాద్, రవి, సైదులు పాల్గొన్నారు.

ఓటు వేయడం బాధ్యతగా భావించాలి

- హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రతి ఒక్కరూ ఓటు వేయడం భాధ్యతగా భావించాలని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్‌ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్ తెలిపారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మక్కా మజీద్‌లో ఓటరు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్‌ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్ మాట్లాడుతూ... త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు వంద శాతం ఓటు హక్కు వినియోగించుకుని ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటాలని పిలుపునిచ్చారు. వంద శాతం ఓటింగ్ అయ్యేలా ఓటర్లను చైతన్య పరచడమే స్వీప్ ప్రధాన లక్ష్యమని, ఆ దిశగా హైదరాబాద్ జిల్లాలో వివిధ కార్యక్రమాల ద్వారా ఓటర్లకు అవగాహన కల్పిస్తూ చైతన్య పరుస్తున్నామన్నారు.

మనం వేసే ఓటు మన భవిష్యత్తును నిర్దేశిస్తుందని, ఎన్నికల ప్రక్రియలో ఓటు హక్కు గల ప్రతి ఒక్కరూ పాల్గొని ఓటు వేయాలని కోరారు. ఓటరు జాబితాలో తమ పేరు ఉన్నదీ లేనిదీ చెక్ చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మక్కా మసీద్ ఆవరణలో మూడు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని, కొత్తగా ఓటరు నమోదుకు ఫారం -6, ఇల్లు మార్చినట్లైతే ఫారం -8 తీసుకుని అక్కడికక్కడే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇట్టి అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. మే13 పోలింగ్ రోజున ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ వచ్చి ఓటు వేసి, ఓటింగ్ శాతం పెరిగేలా సహకరించాలని కోరారు. ఎలాంటి సంకోచాలు, అపోహలకు తావివ్వకుండా నిర్భయంగా, స్వేచ్ఛగా ఓటు వేయాలన్నారు.

గతంలో కంటే ఎక్కువ ఓటింగ్ శాతం పెంచేందుకు ఓటరు చైతన్య కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఓటింగ్ పెరగక పోవడానికి అనేక కారణాలు ఉన్నాయన్నారు వాటిని అధిగమించడానికి ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు ఈ సందర్భంగా కమిషనర్ పేర్కొన్నారు.

జాయింట్ సిఇఒ సర్ఫరాజ్ మాట్లాడుతూ... 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు కావాలని, ఓటరుగా నమోదైన ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకావాలన్నారు . ఓటర్ జాబితాలో ప్రతి ఒక్కరు తమ పేరు చెక్ చేసుకోవాలని, ఏప్రిల్ 15 వరకు ఓటరు నమోదుకు అవకాశం ఉందని, అందుకు ఫారం -6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓటు చెక్ చేసుకోవడానికి ఓటరు హెల్ప్ లైన్ యాప్ డౌన్‌లోడ్ చేసుకొని ఎపిక్ కార్డు నంబర్‌తో చెక్ చేసుకోవచ్చునన్నారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ... హైదరాబాద్ జిల్లాలో ఓటర్ టర్న్ అవుట్ పెంచే దిశగా స్వీప్ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అడిషనల్ కమిషనర్ అలివేలు మంగతయారు, , అడిషనల్ కమిషనర్ చంద్రకాంత్ రెడ్డి, జాయింట్ కమిషనర్ వెంకట్ రెడ్డి, స్వీప్ నోడల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రవికుమార్‌కు తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ జర్నలిస్టుల ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షుడు, కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్‌కు త్రుటిలో ప్రమాదం తప్పింది. మంగళవారం ఖైరతాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తన స్నేహితుడిని పరామర్శించిన అనంతరం ఆయన ఎల్‌బినగర్‌లోని ఇంటికి కారులో బయల్దేరారు. అయితే మార్గమధ్యంలో కొత్తపేట రైతు బజార్ వద్ద కారు టైరు పగిలిపోయి ఊడిపోయింది. దాంతో కారు అదుపుతప్పి డివైడర్‌ను, మెట్రో పిల్లర్‌ను ఢీకొట్టింది. కారులోని ఎయిర్ బ్యాగ్స్ తెరుచుకోవడంతో రవికుమార్‌కు ఎలాంటి గాయాలూ కాలేదు. డ్రైవర్ ఖదీర్ స్వల్పంగా గాయపడ్డాడు.

మార్కెట్లోకి బజాజ్ ఆటో ఇవి ఆటోలు

హైదరాబాద్ : ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ బజాజ్ ఆటో లిమిటెడ్ తమ నూతన కార్గో, ప్యాసింజర్ విద్యుత్ ఆటో శ్రేణిని తెలంగాణ మార్కెట్లోకి విడుదల చేసింది. ప్రయాణీకుల ఇవి త్రీవీలర్ బజాజ్ ఆర్ఇ-టెక్ 9.0ను అందుబాటులోకి తెచ్చింది. ఈ కొత్త వాహనాలు విస్తృత పరిధి, అత్యధిక లోడ్ మోసే సామర్థ్యం, దీర్ఘకాలిక మన్నిక దృష్టితో రూపొందించినట్లు ఆ కంపెనీ ప్రతినిధులు బాబ్జీ నెల్లి, కుబేర్ కెవి తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా తమ డిస్ట్రిబ్యూషన్ సేవలను విస్తరించనున్నామన్నారు.

విశేష సేవలందిస్తున్న మహావీర్ హాస్పిటల్స్

- డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి ప్రశంస

హైదరాబాద్ : బాధితులకు మహావీర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ విశేష సేవలందిస్తుందని ప్రముఖ వైద్యులు డి నాగేశ్వర్ రెడ్డి అన్నారు. మాసబ్ ట్యాంక్‌లోని ఈ హాస్పిటల్‌లో గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగం, డీలక్స్ రూమ్‌లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ చైర్మన్ నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. మహావీర్ ఆసుపత్రి ఎన్నో ఏళ్ళుగా విశేష సేవలు అందిస్తోందన్నారు. గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ స్పెషలైజేషన్ జీర్ణవ్యవస్థను ప్రభావితం చేసే రుగ్మతలు, వ్యాధులను పరిశీలిస్తుందన్నారు. దీనికి సంబంధించిన వ్యాధులు విపరీతంగా పెరుగుతున్నాయన్నారు. నాలుగు దశాబ్దాలుగా కులాలు, మతాలకు అతీతంగా పేదలు, నిరుపేదలకు అత్యాధునిక పరికరాలతో సేవలందించడంలో కట్టుబడి ఉన్నామని ఆ హాస్పిటల్ వర్గాలు తెలిపాయి.

విస్తరిస్తున్న తప్పుడు సమాచారం

- భారత జాతీయ వాదం, మతోన్మాద ప్రమాదం పుస్తకావిష్కరణలో జస్టిస్ చంద్రకుమార్

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జస్టిస్ చంద్రకుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వాస్తవాలను వక్రీకరించి, నిజాలను పాతరేసి, తప్పుడు సమాచారం దేశంలో నేడు విస్తారంగా విస్తరిస్తున్నదని జస్టిస్ బి చంద్రకుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎస్‌వికె ఆధ్వర్యంలో' భారత జాతీయ వాదం, మతోన్మాదం', 'అలనాటి సినీ నాటకరంగ ప్రముఖుల సంకలనం' పుస్తకాలను చంద్రకుమార్ అవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆ పుస్తకాలు రెండూ భిన్న ధృక్పధాలు కలిగినవన్నారు. సమాజానికి దశ, దిశను చూపుతున్నాయని చెప్పారు. నేటి సమాజంలో విలువలకు వలవలూడదీస్తున్న తరుణంలో ఆ పుస్తకాల నుంచి తగిన కర్తవ్యాలను తీసుకోవచ్చన్నారు. ముఖ్యంగా భారత జాతీయ వాదం, మతోన్మాదం అనే గ్రంథం చారిత్రాత్మకమైందన్నారు. చరిత్రలో జరిగిన సత్యాలను అద్దంలో చూసినట్టుగా రచయిత కండ్లకు కట్టినట్టుగా చూపించారని చెప్పారు. చారిత్రక అంశాలను ఉన్నవి ఉన్నట్టుగా చూపించటం ధైర్యంతో కూడుకున్న అంశంగా మారిందన్నారు. వాస్తవాలు మాట్లాడినా, రాసినా పాలకులు భరించలేని దుస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా..నిజాన్ని బంధించటం సాధ్యం కాదని ఆ పుస్తకమే చెబుతుందన్నారు. ఎంతో మంది పాతతరం సినీ రంగ ప్రముఖుల జీవిత విశేషాలతో పుస్తకాన్ని సంకలనం చేయటం వ్యయ ప్రయాసలతో కూడుకున్నదన్నారు. నిజానికి..దీన్ని ప్రభుత్వమే ముద్రించాలన్నారు. కళాకారులను ఆదుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. భారత జాతీయవాదం, మతోన్మాదం పుస్తకాన్ని తెలుగులోకి అనువాదకులు, ఎస్‌వికె మేనెజింగ్ ట్రస్ట్ కార్యదర్శి ఎస్ వినయ్‌కుమార్ మాట్లాడుతూ.. పుస్తక రచయిత రాంపునియాని.. చారిత్ర వాస్తవాలను బయటపెడుతూ అనేక రచనలు చేశారన్నారు. నిజాలను అంగీకరించని ఉన్మాదులు ఆయన్ను బెదిరిస్తున్నారని చెప్పారు. ఇప్పటికే కల్బుర్గీ, గౌరీ లంకేశ్, గోవింద్ పన్సారేలాంటి వారిని హత్య చేసిన ఉన్మాదులు..తన లాంటి వారికి హాని తలపెట్టరని అనుకోవాల్సిన అవసరం లేదన్నారు. పత్రికా స్వేచ్ఛ అంతరించిపోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. దాశరథి థియేటర్‌లో జరిగిన కార్యక్రమంలో అక్కిరాజు సుందరరామకృష్ణ, ఎవి రమణమూర్తి, సూరిబాబు, విజయదుర్గ, జీడికుంట వెంకట్రాములు హాస్య కథలు, వ్యంగోక్తులు, పద్యాలు చదివి వినిపించారు. కార్యక్రమానికి బిడిఎల్ సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముందుకు సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని చంద్రకుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వినయ్‌కుమార్‌తో పాటు జి బుచ్చిరెడ్డి, బాలోత్సవాల కమిటీ నాయకులు సుజావతి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు రానియ్యం

- గజ్వేల్ రైతులకు మంత్రి కోమటిరెడ్డి హామీ
- ఆర్‌ఆర్‌ఆర్ అలైన్‌మెంటు మార్చాలంటూ బాధితుల మొర

రైతులతో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణంలో రైతులకు ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు చేపట్టినట్టు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆర్‌ఆర్‌ఆర్‌లో భూములు కోల్పోతున్న గజ్వేల్ నియోజకవర్గంలోని ఆయా గ్రామాలకు చెందిన దాదాపు 500 మంది రైతులు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని బంజారాహిల్స్‌లోని ఆయన నివాసంలో కలిశారు. పీర్లాపల్లి, ఇటిక్యాల, లింగారెడ్డిపల్లి, ఆలీరాజ్‌పేట్, నర్సన్నపేట, చేబర్తి, పాతూరు, మక్తామాసాన్‌పల్లి, సామలపల్లి, నెంటూర్, బంగ్లవెంకటాపూర్, బేగంపేట్, ఎల్కంటి గ్రామాలకు చెందిన రైతులకు ఇటీవల ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణ భూసేకరణకు నోటీసులు వచ్చాయన్నారు. అయితే తాము ఇప్పటికే మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ ప్రాజెక్టుల నిర్మాణాలతో భూనిర్వాసితులం అయ్యామని తెలిపారు. మళ్లీ తమకు మిగిలిన కొద్దిపాటి భూములు ఆర్‌ఆర్‌ఆర్‌లో పోతే తాము జీవనాధారం కోల్పోతామంటూ బాధితులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. మా పరిస్థితిని మానవతా ధృక్పథంతో పరిశీలించి ఆర్‌ఆర్‌ఆర్ అలైన్‌మెంట్ మార్చేందుకు చొరవ చూపాలని మంత్రిని కోరారు. రైతులతో సుధీర్ఘంగా మాట్లాడిన మంత్రి వారి సాధకబాధకాలను తెలుసుకుని, తాను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు. ఆందోళన చెందవద్దని రైతులకు ధైర్యం చెప్పారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వ తప్పిదాల వలన రాష్ట్ర భవిష్యత్తును మార్చే ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. గత ప్రభుత్వంలా ఒంటెద్దు పోకడలు పోకుండా.. ప్రజాస్వామ్యయుతంగా రైతుల సమస్యలను తీర్చుతూనే రాష్ట్ర అభివృద్ధికి పాటుపడతామని చెప్పారు.

అన్నారం బ్యారేజీలో ఇసుక మేటలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరం ప్రాజెక్టులోని అన్నారం బ్యారేజీ ఎగువ ప్రాంతంలో భారీగా ఇసుక పేరుకుపోయింది. గేట్లకు ఎగువ ప్రాంతంలో 2.54 కోట్ల క్యూబిక్ మీటర్లు, గేట్ల నిర్మాణాల(స్ట్రక్చర్ పాయింట్) వద్ద 6.20 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక పేరుకుపోయిందని, దీన్ని తొలగిస్తేనే ఫౌండేషన్ పరీక్షలు చేయడానికి వీలు పడుతుందని నెల రోజుల క్రితం క్షేత్రస్థాయి ఇంజినీర్లు ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు సమాచారం. ఇసుక ఇంకా తొలగించకపోవడంతో బ్యారేజీ ఫౌండేషన్ పరీక్షలకు ఆటంకంగా మారింది. బ్యారేజీకి దిగువన ఏర్పడ్డ సీపేజీ బుంగలను, ఎగువ ప్రాంతంలో పేరుకుపోయిన ఇసుక మేటలను పలుసార్లు ఉన్నతాధికారుల బృందాలు పరిశీలించి వెళ్లాయి. వర్షాకాలం వచ్చేలోపే ఫౌండేషన్ పరీక్షలు చేయాల్సి ఉంటుందని ఇంజినీరింగ్ అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఇసుకను తొలగించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

ప్రతిపక్షాలకు మంచి ఫలితాలు

- తెలంగాణ భవన్‌లో ఉగాది వేడుకల సందర్భంగా పంచాంగకర్తలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

క్రోధి నామ సంవత్సరంలో పాలక పక్షానికి కష్టాలు ప్రారంభంకానున్నాయని పంచాంగకర్తలు తెలిపారు. కొంచెం కష్టపడితే ప్రతిపక్షాలకు మంచి ఫలితాలు వస్తాయని వారు చెప్పారు. ఉగాది పర్వదినం సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. బిఆర్‌ఎస్ ఖైరతాబాద్ ఇంఛార్జి మన్నె గోవర్ధన్ నేతృత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ముఖ్య అతిథిగా హాజరైన ఈ కార్యక్రమంలో సీనియర్ ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాసరెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పంచాగకర్త ఫణీంద్ర కుమార్...క్రోధి నామ సంవత్సరంలో మంచి, చెడు మిశ్రమంగా కనిపిస్తున్నాయని తెలిపారు. వర్షాలు సమృద్ధిగా కురుస్తాయనీ, పాడిపంటలకు ఇబ్బంది ఉండబోదని వివరించారు. కెటిఆర్‌ది మకర రాశి అని, ఈ రాశి వారు నోరు అదుపులో పెట్టుకుంటే మంచిదనీ, ఆచితూచి మాట్లాడితే బావుంటుందని పరోక్షంగా వ్యాఖ్యానించారు. ఆయన ఆదాయ, వ్యయాలు సమానంగా ఉన్నాయని వివరించారు.

అందరికీ మంచి జరగాలి : కెటిఆర్

అనంతరం కెటిఆర్ మాట్లాడుతూ... కొత్త ఏడాదిలో అందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. ప్రజలంతా శాంతి, సౌభాగ్యం, మతసామరస్యంతో మెలగాలని అన్నారు. సకాలంలో వర్షాలు పడి పాడిపంటలతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.

నివాళులర్పిస్తున్న చెరుపల్లి సీతారాములు

నర్రా రాఘవరెడ్డి జీవితం ఆదర్శనీయం

- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిపిఎం సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే నర్రా రాఘవరెడ్డి జీవితం ఆదర్శనీయమని పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాలలో మంగళవారం సిపిఎం ఆధ్వర్యంలో నర్రా రాఘవరెడ్డి వర్ధంతి సభ నిర్వహించారు. రాఘవరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చెరుపల్లి మాట్లాడుతూ.. నకిరేకల్ నియోజకవర్గంలో ఆరు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచిన రాఘవరెడ్డి ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేశారని కొనియాడారు. జీవితాంతం ప్రజల కోసమే పనిచేశారన్నారు. రాఘవరెడ్డి శిష్యుడిగా తాను ఎంతో గర్విస్తున్నానన్నారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయడమే రాఘవరెడ్డికి నిజమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, జిట్ట సరోజ, నాయకులు శీలా రాజయ్య, బొబ్బిలి సుధాకర్ రెడ్డి, ప్రజా సంఘాల నాయకులు గుండాల యాదయ్య పాల్గొన్నారు.

ఓరుగల్లు సీటుపై బిఆర్‌ఎస్ తర్జనభర్జన

- తాటికొండకు ఇవ్వాలా..? వద్దా...?
- ముఖ్య నేతలతో కెసిఆర్ సమాలోచనలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వరంగల్ లోకసభ సీటుపై బిఆర్‌ఎస్‌లో తర్జన భర్జనలు కొనసాగుతున్నాయి. సీనియర్ నేత కడియం శ్రీహరి, ఆయన కూతురు కావ్య 'హ్యాండి'వ్వటంతో ఇప్పటికీ కోలుకోని ఆ పార్టీ, ఆ సీటును ఎవరికి కేటాయించాలనే దానిపై మల్లగుల్లాలు పడుతోంది. కడియం కోసం సిట్టింగ్ ఎంపీ పసునూరి దయాకర్‌ను కాదనటంతో ఆయన కాంగ్రెస్‌లో చేరిన సంగతి విదితమే. ఇదే కారణంతో సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్ సైతం కారు పార్టీకి రాజీనామా చేసి, బిజెపి కండువా కప్పుకున్నారు. ఇంత చేసినా సీటు దక్కించుకున్న కడియం...బిఆర్‌ఎస్‌కు క్షేత్రస్థాయిలో బలం లేదనే కారణం చెబుతూ పార్టీని వీడారు. దీంతో వరంగల్లు సీటును ఎవరికివ్వాలి..? ఇస్తే వారైనా ఉంటారా..? లేక చివరి నిమిషంలో పార్టీ మారతారా..? అనే సందేహం ఆ పార్టీని వెంటాడుతోంది. దీంతో అభ్యర్థిని ఖరారు చేయలేకపోతున్నారనే వాదనలు వినబడుతున్నాయి. కడియం బయటకు వెళ్లిపోగానే... మాజీ డిప్యూటీ సీఎం తాటికొండ రాజయ్య తిరిగి బిఆర్‌ఎస్‌లో చేరతారనే వార్తలు వెలువడ్డాయి. ఆయనకే ఎంపి టికెట్ ఇస్తారనే ప్రచారం కూడా జరిగింది. ఇప్పటి వరకూ సంబంధిత ప్రకటన వెలువడలేదు. బిఆర్‌ఎస్ అధిష్టానానికి రాజయ్యపై కూడా నమ్మకం లేకపోవటమే ఇందుకు కారణం. గతంలో చిన్న చిన్న కారణాలతో పార్టీ మారిన ఆయన్ను అంతగా విశ్వసించలేమంటూ బిఆర్‌ఎస్ బాస్ తేల్చిచెప్పినట్టు సమాచారం. ఈ క్రమంలో ఎవర్ని అభ్యర్థిగా నిలపాలనే దానిపై ఆయన మరింత లోతుగా చర్చిస్తున్నట్టు తెలిసింది. ఇందుకోసం వరంగల్ జిల్లాకు చెందిన సీనియర్లతోపాటు పార్టీలోని ముఖ్య నేతలతో ఆయన గత కొద్ది రోజులుగా మంతనాలు జరుపుతున్నారు. ఈ క్రమంలో ఉద్యమ నేత పరంజ్యోతి, హన్మకొండ జెడ్‌పి చైర్‌పర్సన్ సుధీర్ కుమార్ పేర్లు తెరపైకి వస్తున్నాయి. వీరిలో ఎవరో ఒకర్ని ఎంపిక చేసే అవకాశముందని సమాచారం.

పార్టీ పేరు మార్పుపై సమాలోచనలు

మరోవైపు బిఆర్‌ఎస్ పేరును టిఆర్‌ఎస్‌గా మార్చాలంటూ ఆ పార్టీ అధిష్టానంపై నేతలు ఒత్తిడి పెంచుతున్నారు. ఇటీవల వరంగల్ జిల్లాకే చెందిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకరరావు ఈ అంశాన్ని బాహాటంగానే ప్రస్తావించిన సంగతి విదితమే. ఇదే తరహాలో ఇప్పుడు పలు జిల్లాలకు చెందిన మాజీ మంత్రులు, సీనియర్లు కూడా బిఆర్‌ఎస్ స్థానంలో టిఆర్‌ఎస్‌ను ఏర్పాటు చేస్తే... పార్టీని ప్రజలు మళ్లీ అక్కున చేర్చుకుంటారంటూ చెబుతున్నారు. ప్రస్తుత ఎంపి ఎన్నికలతోపాటు మున్ముందు స్థానిక సంస్థల ఎలక్షన్లలో గెలవాలంటే పేరు మార్చక తప్పదంటూ వారు కోరుతున్నారు. దీనిపై మరింతగా చర్చించి, ఓ నిర్ణయానికి వస్తామంటూ కెసిఆర్ వారికి నచ్చజెప్పినట్టు సమాచారం.

మంచినీటి కోసం మహిళల రాస్తారోకో

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తాగు నీరు కూడా అందడం లేదంటూ మహిళలు ఆందోళనకు దిగారు. సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండలం తిమ్మాపురం గ్రామంలో ఖాళీ బిందెలతో మంగళవారం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ.. పది రోజుల నుంచి తిమ్మాపురం క్రాస్‌రోడ్ వద్ద నీళ్లు రావడం లేదని, అధికారులెవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉగాది పండుగ రోజున కనీసం స్నానాలు చేయడానికి కూడా నీళ్లు లేకపోవడంతో ఆందోళన చేయాల్సి వచ్చిందన్నారు. వెంటనే అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరారు. గ్రామ ప్రత్యేకాధికారి శశిరెడ్డికి సమాచారం అందజేయడంతో ఆయన అక్కడకు చేరుకుని సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో మహిళలు ఆందోళన విరమించారు.

'మైనంపల్లి' పాచిక పారేనా..?

- కాంగ్రెస్ 'మల్కాజిగిరి' ఇన్‌ఛార్జిగా బాధ్యతలు
- ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మూడింటిపై పట్టు
- పార్టీ, సర్కార్ అండ..
- కార్యకర్తలే బలం..!

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ మల్కాజిగిరి అభ్యర్థి పట్నం సునితా మహేందర్‌రెడ్డి గెలుపు బాధ్యతలను ఆ పార్టీ అధిష్టానం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావుకు అప్పగించింది. టిడిపిలో సీనియర్ నాయకుడిగా ఎదిగిన మైనంపల్లి బిఆర్‌ఎస్‌లో చేరడం, అనంతరం రాజకీయ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్‌లో చేరి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. తాజాగా పార్టీ అధిష్టానం ఒక్కో నియోజకవర్గానికి ఒక ఇన్‌ఛార్జిని నియమించింది. ఈ నేపథ్యంలో సీనియర్ నాయకులు, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో సంబంధాలు ఎక్కువగా ఉన్న మైనంపల్లికి పార్లమెంట్ ఎన్నికల బాధ్యతలు కట్టబెట్టింది.

పోల్ మేనేజ్‌మెంట్.. ఆర్థిక వ్యవహారాలపై చర్చ..

మైనంపల్లికి పలు పర్యాయాలు ఎమ్మెల్యేగా పని చేసిన అనుభవం ఉంది. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలయ్యారు. ఈ ఓటమికి ప్రధాన కారణం పోల్ మేనేజ్‌మెంట్‌తోపాటు ఆర్థిక వ్యవహార లోపమే అనే విమర్శలు ఉన్నాయి. అయితే, అప్పటితో పోలిస్తే ప్రస్తుత పరిస్థితులు వేరనీ, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టడం, కార్యకర్తల బలం, భారీగా చేరికలు, సీనియర్ నాయకుడు మైనంపల్లి ఇన్‌చార్జిగా ఉండటం అభ్యర్థికి కలిసొచ్చే అంశాలని ఆ పార్టీ నాయకులు చర్చించుకుంటున్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో మెదక్ నుంచి కుమారుడు పోటీ చేయడంతో ఆ భారం కూడా ఈయనపైనే పడింది. మల్కాజిగిరి గెలిచేస్తానన్న ధీమాతో పట్టించుకోలేదని తెలుస్తోంది. ఈసారి అలాంటి లోపం లేకుండా పూర్తిగా మల్కాజిగిరిపైనే మైనంపల్లి దృష్టి సారించినట్టు తెలుస్తోంది. ఆ నేపథ్యంలోనే ఆయనకు బాధ్యతలు అప్పగించినట్టు తెలుస్తోంది. అయితే నిన్న మొన్నటి వరకు ఇన్‌చార్జిగా ఉన్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావే వ్యవహరిస్తారని అందరూ భావించారు. దీంతో పోల్ మేనేజ్‌మెంట్‌తోపాటు ఆర్థిక వ్యవహారాలను ఆయన చూసుకుంటారు.. మనం ప్రచారం చేస్తే సరిపోతుందని పార్టీ క్యాడర్, సీనియర్ నాయకులు భావించారు. అనూహ్యంగా ఇన్‌ఛార్జి బాధ్యతలు మైనంపల్లి హనుమంతరావుకు అప్పగించడంతో పోల్ మేనేజ్‌మెంట్, ఆర్థిక వ్యవహారం అనేది ప్రశ్నార్థకంగా మారింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో మల్కాజిగిరి నియోజకవర్గంలో పోల్‌మేనేజ్‌మెంట్ సరిగా లేదనీ, ఆర్థిక వ్యవహారాలు కూడా సక్రమంగా జరగకపోవడంతోనే మైనంపల్లి ఓటమి పాలయ్యారనే అపవాదు ఉంది. కాంగ్రెస్ పార్టీలో పోల్ మేనేజ్‌మెంట్, ఆర్థిక వ్యవహారాలను స్వయంగా ఆయనే చూసుకుంటారా..? లేక అభ్యర్థి తరపు వారు హ్యాండిల్ చేస్తారా..? లేక నియోజకవర్గాల ఇన్‌చార్జీలకు అప్పగిస్తారా..? అనే అంశాలు చర్చ నడుస్తున్నాయి.

మూడింటిలో పరిచయమే..

సునితా మహేందర్‌రెడ్డి గెలుపు కోసం ఇన్‌ఛార్జి బాధ్యతలు చేపట్టిన మైనంపల్లి హనుమంతరావుకు అనుకూల, ప్రతికూల పరిస్థితులపై రాజకీయ చర్చ మొదలైంది. ఈ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోకవర్గాలు ఉన్నాయి. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో సుపరిచితుడిగా ఎదిగిన మైనంపల్లికి.. ఆ జిల్లా పరిధిలోని మేడ్చల్, కుత్బుల్లాపూర్, మల్కాజిగిరి నియోజకవర్గాల్లో క్యాడర్, లీడర్లు ఉన్నారు. కార్యకర్తలను సమన్వయం చేయడం, కాంగ్రెస్‌కు మెజార్టీ ఓట్లు సాధించడం సులభమేనని అనుచరులు అంటున్నారు. మిగిలిన నియోజకవర్గాలైన ఉప్పల్, కంటోన్మెంట్, ఎల్బీనగర్, కూకట్‌పల్లిలో మైనంపల్లికి పెద్దగా పరిచయం ఉన్న నాయకులు లేకున్నా కాంగ్రెస్ పార్టీకి నాయకత్వం ఉంది. ఈ నాలుగు ప్రాంతాలపై ఆయనకు పట్టు లేకపోవడంతో నాయకులను సమన్వయం చేసుకోవడంలో కాస్త ఇబ్బంది పడే అవకాశం ఉంది. కాగా.. ఏడు నియోజకవర్గాల్లో ఒక్కరూ కాంగ్రెస్ ఎమ్మెల్యే లేరు. ఇలాంటి ప్రతికూల పరిస్థితుల్లో సునితా మహేందర్‌రెడ్డిని గెలిపించాలంటే చెమటోడ్చక తప్పదని విశ్లేషకులు చెబుతున్నారు.

చేరికలతో మరింత బలం..

మల్కాజిగిరి పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లోనూ కాంగ్రెస్‌కు ఒక్క ఎమ్మెల్యే కూడా లేరు. 2018 ఎన్నికల్లోనూ ఇదే పరిస్థితి. అయినా అప్పటి ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి ఎంపిగా గెలిచారు. ఇప్పుడు కూడా అదే పరిస్థితి ఉంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఒకటి, రెండు స్థానాలు మినహా మిగతా నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు రెండో స్థానంలో నిలిచారు. ఈ సమీకరణాలకు సిట్టింగ్ ఎంపి రేవంత్‌రెడ్డి సిఎం కావడం, రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి రావడం తోడు కావడంతో గెలుపు సాధ్యమే అని పార్టీ శ్రేణులు లెక్కలేసుకుంటున్నారు. ఇక అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్‌లోకి చేరికలు పెరిగాయి. పేరున్న నాయకులతోపాటు సెకండ్ క్యాడర్, మేయర్లు, ఎంపిపిలు, జెడ్పిటిసిలు, సర్పంచ్‌లు, మండల, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు అధికార పార్టీలో చేరిపోయారు. బోడుప్పల్‌కు చెందిన 10 మందికిపైగా కార్పొరేటర్లు, నిజాంపేట మేయర్ నీలా గోపాల్‌రెడ్డి దంపతులు, కీసర ఎంపీపీతోపాటు మరికొందరు ఇటీవలే కాంగ్రెస్ కండు కప్పుకున్నారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో కుత్బుల్లాపూర్ నుంచి బిజెపి అభ్యర్థిగా పోటీ చేసి రెండో స్థానంలో నిలిచిన కూన శ్రీశైలంగౌడ్ సైతం అధికార పార్టీలో చేరడంతో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపుపై జోరుగా చర్చ నడుస్తోంది. ఇలాంటి తరుణంలో మల్కాజిగిరిలో 'మైనంపల్లి' మంత్రం పారుతుందో..? లేదో..? తెలియాలంటే మరికొద్ది రోజులు వేచి చూడాల్సిందే..!.

కూల్ డ్రింక్స్‌ను నిషేధించాలి

- పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు తాగాలి
- మాజీ విసి ఎస్‌వి సత్యనారాయణ, జెవివి అధ్యక్షులు కోయ వెంకటేశ్వర్లు
- ఒయులో ఉగాది పచ్చడి పంపిణీ

ఒయులో ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న జెవివి నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశ ప్రజల అనారోగ్యానికి కారణమవుతున్న శీతల పానీయాలను నిషేధించాలని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం మాజీ విసి ప్రొఫెసర్ ఎస్‌వి సత్యనారాయణ, జెవివి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోయ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ప్రజలు కూడా ఎవరికి వారే హానికరమైన కూల్ డ్రింక్స్‌ను బహిష్కరించాలని సూచించారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం జనవిజ్ఞాన వేదిక (జెవివి) హైదరాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ ఎన్‌సీసీ గేటు వద్ద ఉగాది పచ్చడి పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఎస్వీ సత్యనారాయణ మాట్లాడుతూ.. దేశ ప్రజల ఆరోగ్యానికి శీతల పానీయాల రూపంలో పెనుముప్పు పొంచి ఉందన్నారు. పురుగుల మందుల తయారీలో వాడే రసాయనాలతో కూల్ డ్రింక్స్ తయారు చేస్తున్నారని చెప్పారు. వాటిని తాగితే ప్రజల ఆరోగ్యం పాడవుతుందన్నారు. గ్రామాల్లోనూ తాగునీరు లేకున్నా శీతల పానీయాలు మాత్రం పుష్కలంగా దొరుకుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. డబ్బులు చెల్లించి మరీ అనారోగ్యాన్ని కొనితెచ్చుకుంటున్నామని వాపోయారు. కూల్ డ్రింక్స్ కన్నా ప్రకృతి సిద్ధ పానీయాలు ఎంతో మేలన్నారు. ప్రతి ఒక్కరూ కూల్ డ్రింక్స్ కాకుండా సహజ పానీయాలైన కొబ్బరి నీళ్లు, చెరుకు, నిమ్మ, పండ్ల రసాలు తాగడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. అందరూ కలిసి ఒకచోట చేరి పండుగలు జరుపుకోవడం వల్ల మానవ సంబంధాలు మెరుగుపడతాయని చెప్పారు. నేటి ఆధునిక సమాజంలో మానవ సంబంధాలు కనుమరుగవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. టెక్నాలజీ పెరిగి ప్రపంచమంతా కుగ్రామంగా మారినా ప్రజలు మాత్రం ఒంటరి వారయ్యారని, సెల్ ఫోన్స్ మనుషులను ఏకాకిలను చేస్తున్నాయని చెప్పారు. జెవివి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ.కోయ వెంకటేశ్వర రావు మాట్లాడుతూ.. కూల్ డ్రింక్స్ వల్ల ఎలాంటి ఉపయోగాలూ లేవన్నారు. కూల్ డ్రింక్స్ పేరుతో కంపెనీలు వేల కోట్ల వ్యాపారాన్ని చేస్తున్నాయని, కానీ ప్రజల ఆరోగ్యాన్ని పట్టించుకోవడం లేదన్నారు. లాభాలు పెంచుకునేందుకు కంపెనీలు సినిమా తారలతో వ్యాపార ప్రకటనలు ఇచ్చి అసత్య ప్రచారాలు ముమ్మరం చేస్తున్నాయని తెలిపారు. కోలా కంపెనీలకు లాభాలు తప్ప ప్రజల ఆరోగ్యం పట్టదన్నారు. దేశంలో నీటిని ఈ కంపెనీలు విచ్చలవిడిగా వినియోగించుకుంటూ నీటి ఎద్దడికి కారణం అవుతున్నాయని చెప్పారు. మన దేశంలో కూల్ డ్రింక్స్‌లో అధిక శాతం ఫెర్టీసైడ్స్ కలుపుతున్నారని తెలిపారు. కొన్ని సంవత్సరాలుగా జెవివి ఇలా కూల్ డ్రింక్స్ అనర్థాలపై అవగాహన కల్పిస్తూ.. ఉగాది రోజున పచ్చడిని పంపిణీ చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జెవివి రాష్ట్ర కార్యదర్శి రాజా, రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ బి.ఎన్.రెడ్డి, రాష్ట్ర నాయకులు ఛాయా మోహన్, జెవివి నగర ప్రధాన కార్యదర్శి ఎస్‌పి లింగస్వామి, నగర నాయకులు భీమేశ్వర్, మాణిక్యాలరావు, విద్యాసాగర్, అల్తాఫ్, రమేష్ పాల్గొన్నారు.